క్లుప్తంగా

విశ్వహిందూ రక్ష పరిషత్ నూతన కార్యవర్గం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పరిషత్ సభ్యులు

బాలాజీచెరువు: విశ్వబంధు ట్రస్ట్ అనుబంధ సంస్థ విశ్వ హిందూ రక్ష పరిషత్ (అంతర్జాతీయ ధార్మిక సంస్థ) శనివారం కార్యనిర్వాహక కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. కాకినాడలో ప్రధాన కార్యాలయంలో మహిళా విభాగంలోని సభ్యులు, పురుష విభాగంలోని సభ్యులు రెండు కూడా జై శ్రీరామ్ నినాదంతో ప్రమాణ స్వీకారం చేశారు. మాతృశక్తి విభాగంలో రాష్ట్ర అధ్యక్షురాలిగా నాళం ఆండాళ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుచిత్రమూర్తి బాలాంత్రపు, పురుష విభాగం అధ్యక్షుడిగా చిట్నీడి శ్రీనివాస్ నియమితులయ్యారు. హైందవ ధర్మ సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా మన గుడి మన బలం సంకల్పంతో, సంస్కృ సంప్రదాయాలు పండుగలు, శాస్త్ర రీతిగా ప్రజలలో అవగాహన కల్పిస్తూ మన ధర్మాన్ని మనం నిలబెట్టే దిశగా పనిచేయాలనే మోటోతో అందరూ కూడా ప్రమాణం చేశారు. ముందుగా అంతర్జాతీయ నాయకులు గోపాల్ రాయ్, జాతీయ నాయకురాలు సుభద్రదేవి, యమునా పాఠక్ నడింపలి వందన సమర్పణ చేశారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

బోట్‌క్లబ్: సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే మెయిన్ లైన్ లీక్ కావడంతో కాకినాడ నగరంలో పలు ప్రాంతాలకు ఈ నెల 13వ తేదీ నుంచి 16వతేదీ వరకూ మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ భావన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా జరిగే రిజర్వాయర్లు శశికాంత్‌నగర్, శ్రీవిద్యాకాలనీ, భాస్కర్ నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, శ్రీనివాస బ్యాంకుకాలనీ గైగోలుపాడు, 1 నుంచి 13, 49, 50 డివిజన్‌లోని పరిధిలో మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ముందుగా మంచినీటిని నిల్వ చేసుకోవాలన్నారు. మంచినీరు అత్యవసరమైతే 6301387834 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

కాకినాడ రూరల్: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో వైద్యుడు అడ్డాల సత్యనారాయణ, జానకి రమ దంపతులు బాలికలకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికా విద్య అనేది అత్యంత శక్తిమంతమైన సాధనాల్లో ఒకటన్నారు. ప్రతి ఏటా అక్టోబరు 11న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ బాలకల దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


రాజుకు డాక్టరేట్



పాండిచ్చేరిలో గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రాజు

కరప: గురజనాపల్లి గ్రామానికి చెందిన, మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజుకు గౌరవ డాక్టరేట్ లభించింది. మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా విద్య, వైద్యం, వసతి, ఆసరా, రక్తదానం వంటి సేవా ర్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. జొన్నలగడ్డ రాజు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ(యుఎస్) వారు గుర్తించి, గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేయగా పాండిచ్చేరిలోని కుంభ కళింగ ఆడిటోరియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖల ద్వారా గౌరవ డాక్టరేట్‌ను రాజుకు ప్రదానం చేశారు. డాక్టర్ జొన్నలగడ్డ రాజును చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవికుమార్, కార్యదర్శి ఎం.అలీమ్, కార్యవర్గసభ్యుడు చింతా నారాయణమూర్తి, కరపమాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, గురజనాపల్లి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన జిల్లా జడ్జి



సత్యదేవుని సన్నిధిలో జడ్జి, కుటుంబ సభ్యులు

అన్నవరం: రాజమహేంద్రవరం జిల్లా జడ్జి గంధం సునీత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులకు ఆలయం పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలను అందించారు.

వీధులు మురికి కూపాలే..

- గ్రామాల్లో సక్రమంగా లేని డ్రైన్లు
- ఎక్కడికక్కడే నిలిచిన మురుగునీరు
- వృద్ధి చెందుతున్న దోమలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నడకుదురు పంటాలు తూము సమీపంలో అధ్వానంగా ఉన్న డ్రైన్



ఎస్సీ వీధి వద్ద మెయిన్ రోడ్డులో నిలిచిన మురుగు నీరు

కరప: గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వీధులు మురికి కూపాలుగా మారుతున్నాయి. వాడుకపునీరు ఇళ్ల మధ్య నిలిచిపోవడంతో బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పల్లెల్లో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయమని అంటున్న పాలకుల ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఒక్క డ్రైన్లు కూడా నిర్మించలేదని గృహిణులు విమర్శిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని మండి పడుతున్నారు.

దోమలకు ఆవాసం

మండల పరిధిలో చాలా గ్రామాల్లో మెయిన్ రోడ్లకు ఇరువైపులా డ్రైన్లు ఉన్నా ఔట్‌లెట్లు లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. వాడక నీరు బయటకు వెళ్లకపోవడంతో వీధులు బురదమయంగా తయారవుతున్నాయి. వర్షం వచ్చిందంటే వీధులు చెరువులను తలపిస్తున్నాయి. అంతేకాక దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమలు పెరిగిపోయి అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. సీసీ డ్రైన్లు నిర్మించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ప్రజలు విమర్శిస్తున్నారు.

కాలువలను తలపించేలా..

డ్రైన్లు లేక నడకుదురు, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, గురజనాపల్లి, వలసపాకల, వేములవాడ తదితర గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నడకుదురులో డ్రైన్లు లేక మెయిన్‌రోడ్డే డ్రైన్‌గా దర్శనమిస్తోంది. ఎస్సీవీధి, షిరిడీసాయి మందిరం సమీపంలో, పెట్రోల్ బంక్, ఆంజనేయస్వామి ఆలయం, జనావళి వృద్ధాశ్రమం తదితర ప్రాంతాలు మరింత దారుణంగా ఉంటోంది. కాకినాడ–రావులుపాలెం ప్రధాన రహదారిలో ఉండే నడకుదురులో మెయిన్‌రోడ్డు కాలువను తలపిస్తోంది. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు వస్తున్నాయంటున్నారే కానీ ఆ నిధులతో డ్రైన్లు నిర్మిస్తే, ఈ బాధలు తప్పేవని ఆ గ్రామ ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి కనీసం కచ్చా డ్రైన్లు అయినా నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

తప్పని ఇబ్బంది



నడకుదురు గ్రామంలో డ్రైన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాడకంనీరు, వీధుల్లో నిలబడిపోయి మురికికూపాలుగా మారుతున్నాయి. డ్రైన్లు నిర్మించాలని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, డ్రైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– జవ్వాది సతీష్, మాజీ ఎంపీటీసీ, నడకుదురు

రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో..



డ్రైన్లు లేక రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. ఎస్సీ వీధిలో, సాయిబాబా గుడి వద్ద, పెట్రోల్ బంక్‌వద్ద మరీ దారుణంగా ఉంటోంది. వర్షం వచ్చిందంటే పంట కాలువలను తలపిస్తున్నాయి. నడకుదురులో మెయిన్‌రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో షిరిడీ సాయిబాబా గుడికెళ్లే భక్తులకు ఇబ్బందికరంగా ఉంటోంది. కచ్చా డ్రైన్లు అయినా నిర్మించాలి

– పోతల లోవప్రసాద్, నడకుదురు

మెడికల్ కాలేజీలు అవసరం లేదనడం విడ్డూరమే



అబ్దుల్ బషీరుద్దీన్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మాజీ ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్ ఒక చానల్ డిబేట్‌లో మెడికల్ కాలేజీల అవసరం లేదని మాట్లాడడం విని దిగ్భ్రాంతికి గురయ్యానని మాజీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జోనల్ అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు మెప్పు కోసం బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు, పేద పిల్లలకు ఈ సమాజంలో ఉన్నత స్థానం కల్పించే మెడికల్ కాలేజీలు అవసరం లేదనసిగ్గుచేటన్నారు. పేదలకు, అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్యను, గౌరవాన్ని దూరం చేసే చంద్రబాబు చర్యలకు భజన చేయడం దారుణమన్నారు. పేదలకు, దళితులకు ద్రోహం తలపెడతారా, ఇదేనా మీ రాజకీయ అనుభవమని ప్రశ్నించారు. మన పొరుగున ఉన్న కర్ణాటకలో 70కి పైగా, తమిళనాడులో 70కి పైగా మెడికల్ కాలేజీలు ఉన్నాయని, మరి మన రాష్ట్రంలో కేవలం 17 మాత్రమే ఉన్నాయన్నారు. వీటిలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేసినవి మూడు కాగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసినవి 6 కళాశాలలన్నారు. మీరు భజన చేస్తున్న విజనరీ చంద్రబాబు 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం, పేద పిల్లలకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు ఒకటి చొప్పున 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టి ఏడు పూర్తి చేశారన్నారు. ఆరు కాలేజీల్లో 800 మంది పిల్లలు చదువుకుంటున్నారన్నారు. వివిధ దశల్లో ఉన్న 10 కాలేజీలను పూర్తి చేయాల్సిన చంద్రబాబు వాటిని పీపీపీ పేరుతో తనకు కావాల్సిన వారికి 66 ఏళ్లకు లీజుకు ఇవ్వడం వల్ల సుమారు లక్ష మంది దళిత, గిరిజన, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల పిల్లలు వైద్య విద్యను అభ్యసించే అవకాశాన్ని కోల్పోతారన్నారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలను ఖండించాల్సిన మాణిక్య వరప్రసాద్ నిస్సిగ్గుగా సమర్థించడమే కాకుండా వైద్య విద్య వేలం వెర్రిగా మారిందని మాట్లాడడం అత్యంత బాధాకరమన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



భోగి గణపతి పీఠంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక స్వయంభూ భోగి గణపతి పీఠంలో 108 వారాల జపయజ్ఞ పారాయణ పూర్తి చేసిన సందర్భంగా శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీవారి భక్త బృందం పంచలోహాల విగ్రహాలను ఊరేగించి నగర సంకీర్తన చేశారు. అనంతరం సుప్రభాత వేళలో దివ్య కల్యాణ ఉత్సవం పూర్తి చేశారు. అర్చకులు కార్తికేయ శర్మ, రవికుమార్ శర్మ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల పాదయాత్రికుడు గోవింద స్వామి దంపతులు శ్రీవారికి తాంబూలం అందించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ కలియుగ ఆది స్వయంభూ తిరుమల శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర చేసినట్టు చెప్పారు. పీఠంలో గణపతి స్వామికి 16వ వార్షికోత్సవంలో కాంస్య కవచ యజ్ఞం నిర్వహించి 108 వారాల జప యజ్ఞ పారాయణతో శ్రీవారి కల్యాణం జరుపుకొనే అవకాశం వచ్చిందన్నారు. మూడు వేల మందికి అన్నసంతర్పణ జరిగింది. మాతా వీర సత్యవేణి ఆధ్వర్యంలో శ్రీవారి భక్త సమాజం సభ్యులు కల్యాణ వేదికను ప్రత్యేక అలంకరణలతో తోమాల సేవ చేపట్టి అలరించారు. ప్రతి ఏడాది వయోవృద్ధులను తిరుమలకు తీసుకువెళ్లి దర్శనం చేయించే ప్రణాళికను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు

కాకినాడ రూరల్: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జీపీ శ్వాస సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అక్టోబర్ పదో తేదీన పంచాయతీ రాజ్ వ్యవస్థలో క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి ప్రతి పంచాయతీని యూనిట్‌గా గుర్తించింది. జనాభా ఆధారంగా పంచాయతీలను నాలుగు గ్రేడ్స్‌గా పునర్ వ్యవస్థీకరణ చేస్తూ, పంచాయతీ కార్యదర్శి పేరును పంచాయతీ అభివృద్ధి అధికారి(పీడీ)గా మార్పు చేసింది. ఇలా పలు నూతన సంస్కరణలు తీసుకువస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన పంచాయతీల రీ కేటగిరైజేషన్ ఫైల్‌కు జీపీపి సంఘం పూర్తి స్థాయి హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో జీపీ శ్వాస సంఘ అధ్యక్షుడు ఆది అశోక్, జెనరల్ సెక్రటరీ రానా నాయుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'నేదునూరి'కి సంగీత నీరాజనం



నేదునూరికి నివాళులర్పిస్తున్న ద్విభాష్యం నగేష్ బాబు, గోపిక, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు

బాలాజీచెరువు: స్థానిక శ్రీరామ సమాజ భవనంలో సంస్కార భారతి, శ్రీరామ సమాజం కాకినాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి జయంతిని నిర్వహించారు. ప్రముఖ వీణ విద్వాంసులు ద్విభాష్యం నగేష్‌బాబు, పీవీఆర్‌కే ప్రసాద్ (ఐఎఎస్) సతీమణి గోపిక, ప్రముఖ జ్యోతిష్య పండితులు, పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. నేదునూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలు, సంగీత ప్రయాణం, విశిష్టతను వివరించారు. నేదునూరి కృష్ణమూర్తి స్వరపరచిన అన్నమయ్య, త్యాగరాజ, రామదాసు, నారాయణ తీర్థులు, యోగి నారాయణ వంటి ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలను స్థానిక కళాకారులు సంగీత నీరాజనంలో గానం చేశారు. ఆకొండి శ్రీనివాస రాజారావు, చావలి సూర్యకుమారి, విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి, తుమ్మల పద్మావతి, స్థానిక విద్యాంసుల శిష్యులు ఈ కార్యక్రమంలో గానం చేశారు. విష్ణు భట్ల శ్రీరామచంద్రమూర్తి, సుబ్బరాయన్ వయోలిన్, వారణాసి శ్రీనివాసు, అనిల్ మృదంగం, సత్య వేదాధర్ ఘటంపై సహకరించారు. మునుగంటి వెంకట్రావు, గట్టి శ్రీ కృష్ణ దేవరాయ వెంకట్రావు ఎంవీజీ కృష్ణంరాజు, ఆర్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందని వైద్యం

- వైద్యం చేయలేమని ఆస్పత్రుల ఎదుట బోర్డులు
- కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్లే దుస్థితి
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: వైద్యం చేయలేమని ఆస్పత్రుల ఎదుట బోర్డులు పెట్టే దుస్థితి కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల ఏర్పడిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఆరోగ్యంపై శాపంలా మారిన కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యశ్రీ నిధులను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పేద మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స చేయించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల ఎదుట వైద్యం చేయలేమని బోర్డులు ఏర్పాటు చేయడం చూస్తే చంద్రబాబు ప్రభుత్వం దివాళాకోరుతనం స్పష్టమవుతుందని నాగమణి అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను బీమా విధానంలో అమలు చేస్తామని కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేడు పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300లకు పైగా ఆస్పత్రుల్లో ఇప్పటికే ఉచిత వైద్య సేవలకు అంతరాయం ఏర్పడిందని, అందుకు కారణం మూడు వేల కోట్ల రూపాయలకు పైగా ప్రభుత్వం బకాయిలు పెట్టడేమన్నారు. 2014– 19 మధ్య ఆరోగ్యశ్రీని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.700 కోట్లు బకాయి పెట్టిన విషయం ఆమె గుర్తు చేశారు. 2024 అధికారం చేపట్టిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు అమలు చేసి పేదల ఆరోగ్యంపై తనకున్న చిత్తశుద్ధిని రుజువు చేసుకున్నారని తెలిపారు. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకుని వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారన్నారు. అటువంటి పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేయడం దురదృష్టకరమన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

90వ సారి రక్తదానం చేసిన లయన్ గవర్నర్ బాలకృష్ణ



రక్తదానం చేస్తున్న బాలకృష్ణ

బాలాజీచెరువు: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని లయన్స్ ఉపగవర్నర్ చిట్టూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక లయన్స్ హాల్లో శనివారం ఆ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు అధ్యక్షతన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్, ప్రముఖ సంఘ సేవలకు డాక్టర్ బాదం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ 90వ సారి రక్తదానం చేసి ప్రతిపుట్టినరోజుకు దాదాపు 80 నుంచి 100 వరకూ యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆపదలో అవసరమైన వారికి అందజేస్తున్నామని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. ఒకరి రక్తదానంతో నలుగురి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. లయన్ ఉపగవర్నర్ పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఐబ్యాంక్, మల్టీఆర్గాన్, క్లాత్ అండ్ ఐగ్లాస్ ఉచిత పంపిణీ, మహిళలకు ఉచిత కుట్టుశిక్షణతో పాటు రెడ్ కాన్వెంట్ ట్రస్ ద్వారా లక్షలాది రూపాయలు విద్య, వైద్యానికి సహాయం చేస్తున్న బాలకృష్ణను ప్రతిఒక్కరూ అభినందించాలన్నారు. ముఖ్యంగా నాగమల్లితోట జంక్షన్ సమీపంలో ల్యాబ్ ఏర్పాటు చేసి పేదలకు నామమాత్రపు రుసుంతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ పూర్వపు గవర్నర్ ఈశ్వరరావు, ఎం.విశ్వేశ్వరరావు, గణేష్, మురళీకృష్ణ, నూకాజీ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిజంలో కలికితురాయి అప్పారావు



అడపా అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టు సంఘు నాయకులు

బోట్‌క్లబ్: జర్నలిజంలో దివంగత అడపా అప్పారావు కలికితురాయిగా నిలిచిపోతారని ఏపీ యూడబ్ల్యూజే ప్రతినిధులు అన్నారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అప్పారావు సంతాప సభ కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం నదీ ముల్లాఖాన్ దురాని అధ్యక్షతన జరిగింది. ఏపీయూడబ్ల్యూజే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టు ప్రతినిధులు మండెల శ్రీరామ్మూర్తి, స్వాతి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి వచ్చిన అప్పారావు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజంలో సేవలందించారన్నారు. ఆయన మృతి జర్నలిజానికి తీరని లోటుగా కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించినట్టు ఏపీయూడబ్ల్యూజే ఎల్రక్టానిక్ ప్రింట్ మీడియా ప్రతినిధులు అంజిబాబు, సబెల్లా శివన్నారాయణ రెడ్డి తెలియజేశారు. అనంతరం అప్పారావు మృతికి సమావేశం రెండు నిముషాలు మౌనం పాటించింది. పలువురు వక్తలు అప్పారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు, ఎల్ శ్రీనివాసరావు, సాంబశివరావు, ఈరోజు సూరిబాబు, మంగా శివరామకృష్ణ, పళ్లంరాజు, మతుకుమిల్లి విజయ్ పాల్గొన్నారు.

సీడ్‌బాల్స్‌తో వేగంగా హరితహారం

అన్నవరం: వివిధ పళ్ల విత్తనాలతో తయారు చేసిన (సీడ్ బాల్స్) బంతులను మైదానాలు, కొండలపై నుంచి విసరడంతో సులభంగా మొక్కలను. అడవులను పెంచవచ్చని అటవీశాఖ విశ్రాంత అధికారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు టి.మల్లికార్జునరావు తెలిపారు.

ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానంలోని సత్యగిరిపై ఆగమ పాఠశాల వెనుక సుమారు 30 వేల సీడ్ బాల్స్‌ను కాకినాడకు చెందిన సెయింట్ జోసఫ్ కాన్వెంట్ విద్యార్థిని విద్యార్థులతో విసిరించారు. ఈ సీడ్ బాల్స్‌లో నేరేడు, వేప, జామ, ఇతర పళ్ల విత్తనాలతో తయారు చేసినట్లు వెల్లడించారు. దీని వలన వచ్చే ఏడాది ఆ ప్రాంతంలో ఈ పళ్ల మొక్కలు పెరుగుతాయని తెలిపారు. ఫలితంగా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి ఎన్.రామచంద్రరావు, ఇతర అధికారులు సత్య పద్మజ, దుర్గారాం ప్రసాద్, జీ.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



గొడ్డటిపాలెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పారావు

కరప: గొడ్డటిపాలెంలో శనివారం పేరూరి కర్ణుడు, రాఘవమ్మ, కల్యాణలక్ష్మి జ్ఞాపకార్థః వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన విరాళాలతో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు ఆవిష్కరించి, బుద్ధపార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బుద్ధపార్క్‌కు అవసరమైన నిధులు సమకూర్చి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఎస్సీలందరూ ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల వినతి మేరకు యువతకు వాలీబాల్ కిట్లను డైరెక్టర్ అప్పారావు బహూకరించారు. మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి, ఎం.మనోజ్, వీరంరెడ్డి ముత్యాలరావు, పులపకూర శుభామహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ షాపుల్లో తనిఖీ



గొరింటలోని బాణసంచా తయారీ షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

పెద్దాపురం(సామర్లకోట): జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శనివారం పెద్దాపురం మండల పరిధిలోని బాణసంచా తయారీ షాపులను అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు షాపుల లైసెన్సు గడువు, ఎన్ఓసీ, కార్మికులకు బీమా పత్రాలను పరిశీలించారు. మండల పరిధిలో జి.రాగంపేట, గొరింట, వడ్లమూరు గ్రామాలలోని బాణసంచా తయారీ షాపులకు సంబంధించిన వివరాలను కలెక్టరుకు అందజేస్తామని తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. కలెక్టరు నుంచి అనుమతులు వచ్చే వరకు బాణసంచా తయారీ నిలుపుదల చేయాలని సూచించారు. బాణసంచా తయారీలో నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి ఎం.శ్రీహరిజగన్నాద్, ఎస్సై మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శారిస్ స్క్రీన్ పెయింటింగ్ శిక్షణ

సామర్లకోట: స్థానిక భీమేశ్వర–సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శారిస్ స్క్రీన్ పెయింటింగ్ శిక్షణ ఇస్తున్నట్టు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. చీరలపై నచ్చిన విధంగా అందమైన డిజైన్లు, పెయింటింగ్‌లు ఇంటి వద్దనే వేసుకొనే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కోర్సు నేర్చు కోవడానికి ఎటువంటి చదువు అవసరం లేదని, మిషనరీ ఖర్చు కూడా ఎక్కువగా ఉండదని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రిజిస్ట్రేషన్, మెటీరియల్ ఫీజుగా రూ.300 చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేస్తున్న స్టేషన్ మేనేజర్, హెల్త్ ఇన్‌స్పెక్టరు

సామర్లకోట: రైల్వే ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. శనివారం సాయంత్రం రైల్వే ప్లాటు ఫారాలపై తాగునీరు విక్రయం చేస్తున్న ఆర్వో ప్లాంటును హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ మేరకు ప్లాటు ఫారాలపై లీటరు వాటర్ రూ.ఐదుకు విక్రయం చేస్తున్న స్టాల్స్ పరిశీలించి తాగునీటి శ్యాంపిల్స్ సేకరించారు. ప్రయాణికులకు హాని కలిగేలా తాగు నీరు, పదార్థాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం



ఫీల్డు కౌన్సిల్ సమావేశానికి హాజరైన పాస్టర్లు

సామర్లకోట: అంతర్జాతీయ పాస్టర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ మేరకు స్థానిక ఆంధ్ర జూబ్లీ బాప్టిస్టు సంఘం ఆవరణలో ఫీల్డు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పాస్టర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బాప్టిస్టు సంఘ పాస్టర్లు బీవీ రాజు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ వందనం, టీ సూర్యారావు, ఐఈ జీవన్‌కుమార్, పిట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.